

కరాటేతో ఆత్మస్థైర్యం

చినజీయర్ స్వామి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు స్కూల్ దశ నుంచే కరాటే నేర్చుకుంటే ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీమన్నారాయణ త్రిదండి చిన జీయర్‌స్వామి అన్నారు. శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ దివ్య సాకేతంలో జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ కరాటే పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వామీజీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్ స్వామి, కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాంక్షలకనుగుణంగా

కాంగ్రెస్ ప్రజా పాలన

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ ప్రజా పాలన సాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పథకాల అమలులో దేశంలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు మండలాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4.10 లక్షల చెక్కులను టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ్మా, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్‌నాయక్, తల్లోజు రామకృష్ణ, కాకి కృష్ణ, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీను, విఠలయ్యగౌడ్, జనార్దన్‌గౌడ్, పర్వత్ రెడ్డి, హీరాసింగ్ పాల్గొన్నారు.



దారంతా పూల వనం..

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి నుంచి లాల్‌పహాడ్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు, వాటికి పూసిన ఎరుపు రంగు పూలు కనువిందు చేస్తున్నాయి. ఈ చెట్లు మండుటెండలోనూ బాటసారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాహనదారులు కొందరు కాసేపు చెట్ల నీడన ఆగి సేదతీరుతున్నారు. - చౌదరిగూడ,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి)

చెగిరెడ్డి ఘణాపూర్‌లో ఇటుకల బట్టీ



జిల్లేడ్‌లో ఇటుకల తయారీకి వ్యవసాయ బోరు నీటి వినియోగం

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు!

గ్రామీణ ప్రాంతాల్లో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలను పట్టించుకోకుండా ఇటుకలను తయారు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. బట్టీ నిర్వాహకులు వ్యవసాయ బావుల నుంచి ఉచిత కరెంట్, నీటిని వినియోగించుకుంటూ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా దందాను కొనసాగిస్తున్నారు. బట్టీల నుంచి వెలువడే దుమ్ము ధూళితో పంట పొలాలు పాడవుతున్నా వీరికి పట్టింపు లేదు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ అధికారులు ఇటుక బట్టీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పచ్చని పొలాల మధ్య ఏర్పాటు

- అనుమతులు లేకుండా దందా
- నిబంధనలు బేఖాతర్
- ఉచిత కరెంట్ వినియోగం
- బట్టీల నుంచి దుమ్ము, ధూళి
- దెబ్బతింటున్న పంటలు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

చౌదరిగూడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని పంట పొలాల మధ్య ఇటుక బట్టీలను ఇష్టానుసారం ఏర్పాటు చేస్తున్నారు. చిన్న పరిశ్రమలు ఏవైనా స్థాపించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి తీసుకోవాలి. కానీ ఇవేమీ పట్టించుకోకుండా ఇటుక బట్టీల వ్యాపారం ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారు. వాల్టా చట్ట ప్రకారం మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందిన తరువాతే ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవాలి. కానీ స్థానిక అధికారుల అండదండలతో

మిగతా 8వ పేజీలో...

గుంతల రోడ్డుతో నరకయాతన



అధ్వానంగా మేడిపల్లి-పల్లెచెల్క తండా దారి

మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల విన్నపం

8



ఇబ్రహీంపట్నం నుంచి బస్సులో బయలుదేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

దారులన్నీ ఎల్కతుర్తి వైపే..

వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు జిల్లా నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో పార్టీ శ్రేణులు సభకు ఉత్సాహంగా కదిలారు. అంతకుముందు స్థానికంగా ర్యాలీలు, జెండా ఆవిష్కరణలు గావించారు. జై బీఆర్ఎస్.. జై కేసీఆర్.. అంటూ నినాదాలు చేసుకుంటూ సభకు బయల్దేరి వెళ్లారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఏప్రిల్ 27



కడ్తాలలో డప్పు కొడుతూ ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

7

వేసవి దుక్కులతో ఉపయోగాలు మెండు!

- చీడ పీడల నాశనం.. పంటకు ప్రయోజనం

ఉద్యాన సాగుపై అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టిసారించి మంచి దిగుబడులు పొందాలని కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు స్వాతి, అఖిల, ప్రీతి, లావణ్య, రచన, శారద, సంతోష, సానియా తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటల సాగుతో పాటు సమగ్ర సస్యరక్షణ, సేంద్రియ వ్యవసాయం, పచ్చిరొట్టె పైర్లు, బహుళ అంచెల పంటల సాగు, అంతర పంటలు, కోల్డ్ స్టోరేజ్, పట్టు పురుగుల పెంపకం, బిందు సేద్యం, భూసార పరీక్షలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి, శ్రీనివాస్, ప్రణీత్‌కుమార్, రైతులు తదితరులు ఉన్నారు.



- పట్టణంలో అందుబాటులో లేని పార్కులు
- నిర్వహణ కొరవడి కళావిహీనం
- నిధులున్నా అసంపూర్తిగానే కొత్త పార్కుల నిర్మాణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆహ్లాదానికి ఆమనగల్లు దూరం!

ఆమనగల్లు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణ ప్రజలు ఆహ్లాదానికి దూరంగా ఉంటున్నారు. ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్నా ఒక్క పార్కు కూడా అందుబాటులో లేదు. నాలుగు మండలాలకు కూడలిగా ఉండి పట్టణ ప్రాంతంగా విస్తరిస్తున్నా ఆమనగల్లులో పార్కులు లేకపోవడం పెద్ద లోటుగా మారింది. గ్రామ పంచాయతీ నుంచి ఆరేళ్ల క్రితం మున్సిపాలిటీగా మారి ఏటా లక్షల రూపాయల ఆదాయం వస్తున్నా పార్కుల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో ఎక్కడా పార్కులు లేకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఆట విడుపునకు, సేద తీరేందుకు నోచుకోవడం లేదు. పట్టణంలోని పలు వెంచర్లలో, మండల పరిషత్ కార్యాలయం, మార్కెట్ యార్డు, అటవీ శాఖ కార్యాలయం, పలు పాఠశాలల్లో విశాలమైన స్థలాలు ఉన్నప్పటికీ పార్కుల నిర్మాణం చేపట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పట్టణ సమీపంలోని పలుచోట్ల ప్రభుత్వ

మిగతా 8వ పేజీలో...

దక్షిణాది రాష్ట్రాలపై

కేంద్రం వివక్ష

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

షాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) దక్షిణాది రాష్ట్రాల మీద కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌కుంట, దైవాలగూడ గ్రామాల్లో పార్టీ గ్రామశాఖ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులు ఇవ్వకుండా చిన్నచూపు చూస్తుందన్నారు. దేశంలో ఉగ్రవాదులు చొరబడి 29 మంది అమాయక ప్రజలను బలితీసుకోవడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఉగ్రవాదాన్ని రాజకీయాలకతీతంగా దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఎదురించి మట్టుపెట్టాలని సూచించారు. పీఎం నరేంద్రమోదీ, బీజేపీ నాయకులు ఉగ్రవాద ఘటనను రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం హేయమైన చర్య అన్నారు. కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల శతాబ్ధి ఉత్సవాల సందర్భంగా ప్రతీ కార్యకర్త విధిగా పార్టీ జెండాను వాడవాడలా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గం కార్యదర్శి రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు ఆనందం, నర్సింహులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

నాగర్‌కుంట, దైవాలగూడ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. నాగర్‌కుంట గ్రామశాఖ కార్యదర్శిగా పి. శ్రీశైలం, సహాయకార్యదర్శిగా మధుకుమార్, సభ్యులుగా మల్లయ్య, రుక్కయ్య, షబ్బీర్, దైవాలగూడ గ్రామశాఖ కార్యదర్శిగా టి. నారాయణ, సహాయ కార్యదర్శిగా కే. మురళి, సభ్యులుగా రఘురాం, విఠల్, నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జీపీల్లో నిధులు నిల్!



- తొమ్మిది నెలలుగా అందని కేంద్ర ప్రభుత్వ ఫండ్స్
- భారంగా జీపీల నిర్వహణ
- అస్తవ్యస్తంగా పంచాయతీలు

ఆదిభట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామ పంచాయతీలకు నిధుల గ్రహణం పట్టింది. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రతీనెల పంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర, కేంద్ర నిధులు రాక అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు కల్పిచడంలో అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీనెల మంజూరు చేసే నిధులతో పనులు, ప్రజలకు వసతుల కల్పన, జీతాలకు ఖర్చు చేస్తారు. కానీ, 9 నెలలుగా నిధులు రాక పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయి. మండలంలో మొత్తం 14 పంచాయితీలు ఉన్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన ఏడాదిన్నర కింద ప్రత్యేకాధికారులను నియమించారు. ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించక కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్రం ఎస్ఎఫ్‌సీ నిధులు రాలేదు. నిత్యం చేపట్టాల్సిన పనులు ముందుకుసాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు కూడా భారంగా మారింది.

అందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు

కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులు సంవత్సరం నుంచి, ఎస్ఎఫ్‌సీ ద్వారా రెండేళ్ల నుంచి నిధులు విడుదల చేయలేదు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు నిధులు మంజూరవుతాయి. 14 పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ ప్రకారం రూ.13.28 కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంది. వీటితో జీపీ కార్మికుల జీతాలు తప్ప.. మిగతా వాటికి నిధులను వినియోగించవచ్చు. కానీ, ఏడాదిగా నిధులు మంజూరు కాలేదు. కేంద్ర నిధులు రాకపోవడానికి కారణం.. స్థానిక ఎన్నికలు నిర్వహించకప్రజాప్రతినిధులు లేకపోవడమే. రాష్ట్రం నుంచి ప్రతీనెల రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు సైతం నిలిచిపోయాయి.

ట్రెజరీల్లో మూలుగుతున్న చెక్కులు!

గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో చెక్కులు అందించారు. కానీ, ఇచ్చిన చెక్కులు పాస్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్లు సైతం పనులు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. నిధులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు. దాంతోపాటు ఇబ్రహీంపట్నం మండలం పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేసిన కార్యదర్శులు.. ట్రెజరీలలో జమ చేశారు. వాటి నుంచి కార్మికులు, కార్యదర్శులకు అందించే జీతాలకు డబ్బు డ్రా చేద్దామంటే చెక్కులు పాస్ కావడం లేదు. పంచాయతీల్లో వసూలు చేసిన పన్నులను ట్రెజరీల్లో జమచేయగా పంచాయతీలు జారీ చేసే చెక్కులు పాస్‌కాక కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన పల్లె ప్రకృతివనాల నిర్వహణ, తాగునీరు, డ్రైనేజీ వంటి పనులు చేయాలన్నా ఇబ్బందులు తప్పడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడం లేదు. ప్రతీనెల చెల్లించాల్సిన నిధులు రాక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులు మంజూరు చేయాలి.

- సీహెచ్.జంగయ్య, సీపీఎం నాయకుడు

కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాం

పంచాయతీల్లో నిధుల్లేక కార్మికులకు చెల్లించాల్సిన జీతాలు ఇవ్వలేకపోతున్నాం. శానిటేషన్, వీధి దీపాలు, తాగునీరు, మ్యాన్‌హోల్స్, పారిశుధ్య నిర్వహణ వంటి అత్యవసర పనులకు ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఫండ్స్ విడుదల చేయాలి.

- శివకుమార్, కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అడుగంటుతున్న చెరువులు

- పూడిక తీయాలంటున్నరైతులు

బషీరాబాద్,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): తీవ్ర ఎండలతో మండలంలోని చెరువులు అడుగంటిపోతున్నాయి. ఫలితంగా సమీప పొలాల్లోని బోర్లలో భూగర్భ జలాలు పాతాంలోకి వెళ్లి నీరు పోయడంలేదు. ఆయా గ్రామాల్లో చెరువులు ఎండిపోతుండటంతో పశువులకు నీటి సమస్య తలెత్తే ఆవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నవాల్ల నల్ల చెరువు, ఎల్లమ్మ చెరువు, అక్కలమ్మ చెరువు, ఎక్మాయి తూర్ తలాబ్, నవాంద్గీ పెద్ద చెరువులు ఇప్పటికే 80శాతంపైగా ఎండాయి. ఈ చెరువుల్లో ఇప్పుడు పూడిక తీస్తే భవిష్యత్తులో చెరువుల్లో మరింత ఎక్కువ నిల్వ ఉండి ఎండల్లో ఇబ్బందులు రావని రైతులు అంటున్నారు.


నీరు ఎండి మట్టి తేలుతున్న నవాల్ల నల్ల చెరువు

ప్రవేశ పరీక్ష ప్రశాంతం

తాండూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధి ఐనెల్లిలో గల మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9, 10వ తరగతుల్లో అడ్మిషన్ పొందేందుకు ఆదివారం ప్రవేశ పరీక్షనిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆరో తరగతి పరీక్షకు 85 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారుజ 7, 8, 9, 10వ తరగతులకు 90 మంది అప్లై చేసుకోగా 66మంది హాజరైనట్లు తెలిపారు. మొత్తం 212మందికి గాను 151 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

వాజ్‌పేయి దేశానికే దిక్సూచి

పరిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, దివంగత వాజ్‌పేయి దేశానికి దిక్సూచి లాంటి నేత అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి కొనియాడారు. అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పరిగిలోని ఎస్వీ గార్డెన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాడు వాజ్‌పేయి తీసుకున్న అనేక నిర్ణయాలతో నేడు ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. విదేశీ వ్యవహారాలపై ఆయన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశానికి మేలు జరుగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, రవికుమార్‌గౌడ్, రాముయాదవ్, యాదయ్య, విజయ్‌కుమార్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా పత్ర్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పలు రకాల పుష్పాలతో పురోహితులు పూలంగి సేవ నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పురోహితులు పాల్గొన్నారు.



భక్తులతో సంగమేశ్వరాలయం కిటకిట


ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

యాలాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సంగెంఖుర్దు సంగమేశ్వర ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య కావడంతో మండల ప్రజలే కాకుండా తాండూరు నుంచి వందలాది భక్తులు తరలివచ్చి సంగమేశ్వరున్ని దర్శించుకున్నారు. సంగమేశ్వర ఆలయం పక్కనగల త్రివేణి సంగమం నదీ స్నానాలు ఆచరించారు. ఆదివారం అమావాస్య రోజు సంగమేశ్వర స్వామి దర్శించుకుంటే పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. ఆలయ సిబ్బంది దేవాలయం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా బీరప్ప స్వామికి బోనాలు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

మోమిన్‌పేట్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లిలో ఆదివారం కామరతి బీరప్పస్వామి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బీరప్పస్వామికి బోనాల నైవేద్యాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో హోరెత్తించారు. ఉత్సవాల్లో మోమిన్‌పేట్ సొసైటీ ఛైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి నవనీత దంపతులు బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భారీగా గొల్ల కురుమలు సభ్యులు పాల్గొన్నారు.

నాగలితో సభకు తరలిన మల్లారెడ్డి

బోయినపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ నాయకులు భారీగా తరలారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేసేందుకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నాగలిని తీసుకెళ్లారు. మల్లారెడ్డి వ్యయప్రయాసల కోర్చి నాగలిని బోయినపల్లిలోని తన నివాసంలో టేకు కర్రతో తయారుచేయించారు. అయితే బీఆర్ఎస్ పార్టీలో తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పాటు చేసుకున్న ఆయన వరంగల్ సభలో తనదైన శైలిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోయినపల్లిలో కార్యకర్తలతో కలిసి తానూ రైతునేనని, అందుకే ఈ నాగలి అంటూ రైతు నాగలిని భుజాన పెట్టుకుని ఆకర్షించారు.


తాను చేయించిన నాగలిని చూపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

వేసవి దుక్కులతో ఉపయోగాలు మెండు!

- లోతైన దున్నకాలతో పంటలకు మేలు
- నేలలోని పోషకాలు పూర్తిగా వినియోగం
- చీడపీడల నాశనం.. అధిక దిగుబడికి ఊతం


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

చేవెళ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వేసవిలో పొలాల్లో పంట విరామసమయంలో రైతులు సాధారణంగా బీడు భూములను అలాగే వదిలేస్తారు. నిజానికి అప్పుడే సిసలైన దుక్కి పనులు చేపట్టాలి. పంట ఎదుగుదలకు, దిగుబడిలో కీలకం దుక్కులే అనడంలో సందేహం లేదు. దుక్కులు ఎంత బాగా చేస్తే పంట అంత ఏపుగా పెరుగుతుంది. నేలలోని అన్ని రకాల పోషకాలు పైరుకు అందుతాయి. తొలకరి వర్షాలు మొదలయ్యే నాటికే లోతైన దుక్కులు చేసుకోవాలి. ఇలా చేస్తే నేల పూర్తిగా ఎండుతుంది. పొలంలో పంట నాశించే పురుగులు చనిపోతాయి. వాటి లార్వాలు సైతం భూమిలో కలిసి పంట సమయంలో పురుగుల ఉధృతి భారీగా తగ్గుతుంది. వేసవిలో నేల యాజమాన్యంపై చేవెళ్ల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ పలు సూచనలు చేశారు.

దుక్కులు లోతుగా చేసుకుంటే...

వేసవి దుక్కి చేసుకునేందుకు తేమ ఉన్న నేలల్లో ట్రాక్టర్లు లేదా ఎడ్ల నాగళ్లతో దుక్కి చేసుకోవాలి. 9 ఇంచ్‌లకు తగ్గకుండా లోతుగా దున్నాలి. అలా చేస్తేనే మట్టి మొత్తం కిందికి మీదికి అయి లోపలి పొరలోని సూక్ష్మధాతువులు, పోషకాలు పైకి వచ్చి మొక్కలకు అందుతాయి. అలాగే పంటను నాశనం చేసే కీటకాలు ఎండకు చనిపోతాయి. యాసంగి పంటలు కోతలు పూర్తయిన వారం పది రోజుల్లోపు దుక్కులు చేసుకోవాలి.

సహజ ఎరువుల కోసం...

గతంలో సంమృద్ధిగా ఉండే పశుసంపద ఇప్పుడు అంతంత మాత్రంగానే ఉంది. ఎడ్లు, ఆవులు, గేదెలతో రాత్రుళ్లు పొలంలోనే మందలు పెట్టేవారు. దాంతో నేలకు సహజ ఎరువులు లభ్యమయ్యేవి. పశువుల సంఖ్య తగ్గి పశువుల ఎరువు లభ్యం కావడం లేదు. దీంతో కొందరు రైతులు గొర్లు, మేకల మందను పొలాల్లో పెడుతున్నారు. ఇలా మంద పెట్టడం పనులు పంట విరామ సమయాల్లోనే చేయాలి. దీంతో సహజ ఎరువు లభించి నేలలో సారం పెరుగుతుంది. రసాయన ఎరువుల వినియోగం తగ్గి పెట్టుబడీ తగ్గుతుంది.

కలుపు నివారణ

తుంగ, గర్క, గుంజర, వొలిపిరి వంటి మొండిజాతి కలుపు మొక్కలు బాగా పెరిగి పంట దిగుబడిలకు నష్టం కలుగజేస్తాయి. నేల సారాన్ని కలుపు మొక్కలు ఎక్కువ తీసుకుంటాయి. దీంతో పంట మొక్కల ఎదుగల లోపిస్తుంది. వేసవి దక్కులతో ఈ కలుపు మొక్కల విత్తనాలు, వేర్లు, కాయలు నశిస్తాయి. అలాగే దుక్కి సమయాల్లో బయటపడే కలుపు మొక్కల కాయలు, వేర్లు దుంపను ఏరేస్తే కలుపును అరికట్టొచ్చు.

వేళ్లూనుకుంటాయ్!

వేసవి దక్కులతో నేల వదులవుతుంది. వర్షం పడిన తరువాత గొర్రుతిప్పి విత్తనాలు వేస్తే మొక్కలు పెరిగేకొద్దీ వాటి వేర్లుబాగా విస్తరిస్తాయి. అలాగే నేల ఎక్కువ నీటిని పీల్చుకొని తేమ ఎక్కువ రోజులుంటుంది. వర్షాభావ పరిస్థితుల్లో మొక్కలు ఎండకుండా ఉంటాయి. కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లను నేలలో కలియదు న్నితే ఎరువుగా మారుతాయి. నేలలో హ్యూమస్ పెరిగి మొక్కలకు సహజ ఎరువు లభ్యమవుతుంది.

వేసవి దుక్కులతో మంచి ఫలితాలు



వేసవిలో దుక్కులను దున్నుకోవంతో వర్షకాలంలో రైతులకు మంచిఫలితాలు వస్తాయి. లోతుగా దక్కులు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలుంటాయి. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలి. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. ఆధునిక పద్ధతులతో సాగు చేసుకోవాలి. ప్రభుత్వ సబ్సీడీలను సద్వినియోగం చేసుకోవాలి.

- శంకర్‌లాల్, ఏవో, చేవెళ్ల

పంట పొలాలకు ఎరువుల తరలింపు

ధారూరు: మండలంలో పరిధి గ్రామాల్లో రైతులు ఎరువులను కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. పంట కోత పూర్తయిన పొలాలకు పశువుల ఎరువు తరలించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక ట్రాక్టర్ పశువుల ఎరువు రవాణా, కూలీల చార్జీలు కలిపి రూ.4,500కు కొనుగోలు చేసి పొలాల్లో పోయించుకుంటున్నారు. ఇందులో పశువుల ఎరువుకు రూ.3వేలు కాగా రవాణా, కూలీల చార్జీ 1500 అవుతున్నాయి. మేకలు,గొర్రెల ఎరువుకు రవాణా కూలీ చార్జీ కలుపుకొని రూ.4వేలు వరకు చెల్లిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో నేలకు సత్తువ చేకూరుతుందని రైతులంటున్నారు. దీంతో సహజ ఎరువు ధర పెరిగింది.



ఆన్‌లైన్ గేమింగ్‌కు దూరంగా ఉండాలి


క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ కేపీవీ.రాజు

యాచారం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): యువకులు ఆన్‌లైన్ గేమింగ్‌కు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఆదివారం మొండిగౌరెల్లిలో ఎంపీఎల్ క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఫస్ట్ ప్రైజ్ 20వేలు, సెకండ్ ప్రైజ్ రూ.15వేలు, థర్డ్ ప్రైజ్ రూ.10వేలు అందించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ చెడు అలవాట్లు చేసుకోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లన్నీ మోసమేనని, వాటితో డబ్బు సంపాదించాలని అనుకోవడమే తప్పు అన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. యువత ఉద్యోగాలు, స్వయం ఉపాధితో తల్లిదండ్రులకు, కుటుంబానికి అండగా ఉండాలన్నారు. తన తండ్రి పేరిట ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సహకారమందిస్తానని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఈ సందర్భంగా చెప్పారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోజంతా వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు



మంబాపూర్‌లో పగటిపూట వెలుగుతున్న వీధిలైట్లు

పెద్దేముల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పగలు రాత్రీ తేడా లేకుండా కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. వాటిని ఆఫ్‌చేసే నాథుడు లేడు. దీంత విద్యుత్ దుబారాతో పాటు పంచాయతీలకు కరెంటు బిల్లూ పెరుగుతోంది. మంబాపూర్‌లో వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ సిస్టం పెట్టారు. సర్పంచ్‌లు ఉన్న సమయంలో వాటిని ఎప్పటికప్పుడు పనిచేసేలా చూసేవారు. ఇపుడు ఆన్‌ఆఫ్ సిస్టం పనిచేయక కరెంటు ఉన్నంత సేపూ లైట్లు వెలుగుతున్నాయి. దీంతో కొన్ని బల్బులు ఫెయిల్ అవుతున్నాయి. గ్రామం మొత్తం ఎస్పీపీ బాక్సులు అమర్చేందుకు ఐదారువేలు అవుతుంది. ఆ మాత్రం వ్యయం చేయలేక నెలనెలా 20వేలకుపైనే చెల్లిస్తున్నారు. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో పగటిపూట వీధిదీపాలు వెలగకుండా ఆన్‌ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులు ఏకం కావాలి



సభలో మాట్లాడుతున్న జేబీ.రాజు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బహుజనుల రాజ్యాధికారం కోసం బడుగు బలహీన వర్గాలంతా ఏకం కావాలని దళితసేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జేబీ.రాజు అన్నారు. రాజ్యాంగ హక్కులను కొందరు హరించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన పూలే, అంబేడ్కర్‌ల జన జాతర సభలో ఆయన మాట్లాడారు. పూలే, అంబేడ్కర్‌లు రగిలించిన సామాజిక విప్లవాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాలకు చదువు, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో అవకాశాలు వచ్చాయంటే అది అంబేడ్కర్ పుణ్యమేనంటూ గుర్తు చేశారు. అణగారిన వర్గాల చదువుకోసం పూలే చేసిన కృషిని సమాజం మరువదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం కోసం పోరాటాలు తప్పవన్నారు. కుల గణనకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. నేటికి కుల వివక్ష కొనసాగుతోందని, కుల దురహంకార హత్యలకు ఎదురొడ్డి పోరాడాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.సామెల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రకాశ్‌కారత్, ప్రజాసంఘాల నాయకులు పురుషోత్తం, ఎం.ఆనంద్, బుగ్గరాములు, సత్తన్న, అరుణ్‌కుమార్, కిష్టయ్య, సీహెచ్.జంగయ్య, శంకర్, కె.రవి పాల్గొన్నారు.

తాండూరులో గాయని మధుప్రియ సందడి

తాండూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తాండూరులో సింగర్ మధుప్రియ సందడి చేశారు. గంగోత్రి విద్యాలయ వార్షికోత్సవం, మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మధుప్రియ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులతో కలిసి మధుప్రియ పాటలతో హోరెత్తించారు. ప్రజలు, కార్యక్రమాన్ని తిలకించేందుకొచ్చిన తల్లిదండ్రులు మధుప్రియతో ఫొటోలు దిగారు. ఆమెను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, స్కూల్ యజమాన్యం సన్మానించింది. కరస్పాండెంట్ రాములు, ప్రిన్సిపాల్ గోపాల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సరితాదేవి పాల్గొన్నారు.



మధుప్రియను సన్మానిస్తున్న నిర్వాహకులు

అంబేడ్కర్‌పై అహంకారపూరిత వ్యాఖ్యలు సరికాదు


నేదునూరులో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలు క్షమించరానివని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతొక్కరూ కట్టుబడి పని చేయాలని కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నేదునూరు, బాచుపల్లిల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చైతన్యమంతం చేశారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు పన్నిందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించేందుకే కాంగ్రెస్ జై సంవిధాన్‌ను చేపడుతోందన్నారు. బడుగు వర్గాలకు అండగా ఉన్న రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు సిద్ధమైన బీజేపీ నాయకత్వానికి ప్రజలు బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలు, రాజ్యాంగాన్ని పట్టుకొని నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేశారు.

సన్న బియ్యం విందులో కేఎల్లార్

ప్రభుత్వం రేషన్ షాపుల్లో సరఫరా చేస్తున్న సన్నబియ్యంతో పేదలకు మేలు కలుగుతోందని లక్ష్మారెడ్డి అన్నారు. మాన్నెగూడతండాలో జెమ్లాదేవి ఇంట్లో రేషన్ బియ్యంతో వండిన భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదకుఉ ఇళ్లు, రేషన్‌కార్డులు, కొత్తగా పింఛన్లు మంజూరవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్,మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల ఇన్చార్జి పెంటారెడ్డి, కె.రాణాప్రతాప్‌రెడ్డి, సత్యనారాయణ, సరికొండ పాండు, శ్రీధర్, వెంకటేశ్, మూల హన్మంత రెడ్డి, భూపాల్‌రెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్, కె.యుగేందర్‌గౌడ్, సురేందర్, అమరేందర్‌రెడ్డి, పుష్ప, ఇ.రాఖేష్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం

ఇబ్రహీంపట్నం: బడుగు బలహీన వర్గాలు, గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే రాజ్యాంగ ఫలాలు దక్కి పూర్తి స్థాయి న్యాయం జరుగుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కాపాడుకునేందుకు పార్టీలకతీతంగా ప్రజలంతా ఏకం కావాలని అన్నారు. కాంగ్రెస్‌సేవాదళ్ ఆదివారం ఇబ్రహీంపట్నంలో జై సంవిధాన్ పేరుతో రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించింది. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ర్యాలీగా బయల్దేరి మార్కెట్ యార్డు ముందున్న జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ముగించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగ, రాజీకయ రంగాల్లో సమాన వాటా కల్పించాలని రాజ్యాంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు. రాజ్యాంగ రక్షణకోసం గ్రామ స్థాయి నుంచే ప్రజలు చైతన్యం కావాలన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో తీసుకుపోతుందంటూ కొనియాడారు. రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంకాల దాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, ఈసీ.శేఖర్‌గౌడ్, మహిపాల్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, శివకుమార్, ఆకుల ఆనంద్‌కుమార్, కరుణాకర్, రాఘవేందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంగమ్మ పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రూ.13.37లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యం, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్. కొందుర్గు, చౌదరిగూడ, నందిగామ, చౌదరిగూడ, కొత్తూరు మండలాల వారు అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వారిలో 30 మందికి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో రూ.13.37లక్షల సీఎంఆర్ చెక్కులను అందజేశారు. పేదలు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకయ్యే ఖర్చును కొంతమేర ప్రభుత్వం భరిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు.

ఆశ్రమంలో ఉచిత కంటి వైద్యశిబిరం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సాయిగీ ఆశ్రమంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలను అందజేశారు. కంటి ఆపరేషన్ అవసరమున్న రోగులను గుర్తించారు. కార్యక్రమంలో యశోద ఆస్పత్రి వైద్యులు సరికి వెంకటరావు, ఎం.భానుప్రకాశ్, సాయిగీతాశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇకపై వారికి పింఛన్

- స్పౌజ్ కేసులకు వర్తింపు



తాండూరు,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పింఛన్‌ల కోసం ఎదురు చూసిన దరఖాస్తుదారులు అలసిపోయారు. ఈ ప్రభుత్వం కూడా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొంత మేర పింఛన్‌దారులపై కొంత కనికరం చూపింది. ఆర్థిక భారం పడకుండా పింఛన్‌లు మంజూరు చేసేలా చూస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్పౌజ్ కేసులను పరిశీలిస్తోంది. వృద్ధాప్య పింఛన్ పొందుతూ భార్యభర్తల్లో ఎవరు చనిపోయినా దంపతుల్లో బతికున్న వారికి పింఛన్ మంజూరుకు వివరాలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం వృద్ధాప్య, వితంతు పింఛన్‌దారులకు నెలనెలా రూ.2,016 చెల్లిస్తోంది. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా అర్హులను గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వీరందరికి మే నెలలో పింఛన్లు మంజూర య్యేలా చూస్తామని సెర్ప్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భార్య/భర్త డెత్ సర్టిఫికెట్, పింఛన్ కార్డు, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంకు అకౌంట్, ఓటర్ ఐడీ కార్డులను జత చేయాలని అధికారులు సూచిస్తున్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా స్పౌజ్ కింద 4,798 మంది అర్హులను గుర్తించారు. ఈ నెలాఖరు కల్లా స్పౌజ్ పింఛన్లు అప్డేట్ చేసి మేలో ఇచ్చేలా డీఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మైగ్రియంట్స్, బోగస్‌ల ఏరివేత

గ్రామాలు, పట్టణాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస పోయిన వారు చేయూత(ఆసరా) పింఛన్ కోల్పోతున్నారని గ్రామీణ పేదిరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అధికారుల పరిశీలనలో తేలింది. ఇలా వలస వెళ్లిన వారి వివరాలు సేకరించారు. వరుసగా వరుసగా మూడు నెలలు డబ్బు తీసుకోకుంటే పింఛన్ రద్దు చేస్తారు. గ్రామాభివృద్ధి శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పర్మినెంట్ మైగ్రియంట్స్(శాశ్వతంగా వలస వెళ్లినవారు)ని 10,600గా గుర్తించారు. గ్రామాల్లో పోస్టాఫీసులు, మున్సిపాలిటీల్లో బ్యాంకు అకౌంట్ల ద్వారా పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో శాశ్వతంగా వలసవెళ్లిన వారి, చనిపోయిన వారి పేర్లను తొలగిస్తారు. చాలా కాలంగా పింఛన్‌కు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు డీఆర్డీఏ అధికారులు పేర్కొంటున్నారు. జీవిత భాగస్వామిని కోల్పోయి, కుటుంబ భారం మోస్తున్న వితంతువులకు పింఛన్లు మంజూరుచేయాలని కోరుతున్నారు. కొన్నేళ్లుగా వితంతు పింఛన్లు మంజూరుచేయడం లేదని గ్రామాల్లో పేదలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 4వేల వరకు వితంతు పింఛన్లు పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. పింఛన్ల సంఖ్య పెంచకున్నా పర్వాలేదుకానీ పాతవారి స్థానంలో స్పౌజ్‌కు ఇవ్వాలని కోరుతున్నారు.

మార్కెట్ యార్డు నుంచి పందుల తరలింపు

ఆమనగల్లు,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ యార్డ్ నుంచి ఆదివారం పందులను తరలించారు. మార్కెట్ యార్డ్‌లో పందుల బెడద ఎక్కువైంది. ధాన్యాన్ని తెస్తున్న రైతులు పందులతో ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకొని పందుల పెంపకందారులకు సమాచారం ఇచ్చారు. పందులను తరలించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పెంపకందారులు ఆదివారం పందులను తీసుకుపోయారు.


పందిని బంధిస్తున్న పెంపకందారులు

జనానికి డబ్బులిచ్చి సభకు తీసుకెళ్లారు



తాండూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలను బలవంతంగా తరలించారని డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. సభకు వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో ఒక్కొక్కరికి రూ.500 చెల్లించి మరీ తరలించారని విమర్శించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదని, కొందరు ఆ పార్టీ నాయకులు, కార్యర్తలే వెళ్లారని తెలిపారు. పోయిన వారికీ కూడా డబ్బులిచ్చే తీసుకెళ్లారన్నారు. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, తాండూరు, యాలాల నుంచి స్వచ్ఛందంగా ఎవరూ వెళ్లలేదన్నారు. ప్రజలకు పార్టీపై అభిమానం ఉంటే బీఆర్ఎస్ నాయకులు ఇంతగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదన్నారు. సభ కోసం పెట్టిన బస్సులు ఖాళీగా కన్పించడంతో నాయకులు ప్రజల ఇళ్లకు వెళ్లి వారిని ఒప్పించి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల మద్దతు పూర్తిగా కాంగ్రెస్‌కే ఉందని పేర్కొన్నారు.

మినీ స్టేడియం నిర్మాణం ఎప్పుడో?

- ఆమనగల్లులో ప్రతిపాదనలకే స్టేడియం పరిమితం
- వసతుల్లేక విద్యార్థులు, క్రీడాకారుల ఇబ్బందులు
- పంట పొలాలు, ఇళ్ల మధ్య ఆడుకుంటున్న వైనం


ఇరుకైన స్థలంలో ఆటలాడుతున్న విద్యార్థినులు(ఫైల్)

ఆమనగల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో మినీ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలింది. చాలా కాలంగా స్టేడియం నిర్మాణం విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపడం లేదు. స్టేడియం ఏర్పాటుకు స్థానికులు పదేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతునా స్పందన లేదు. ప్రతి మండల కేంద్రంలో మిమీ స్టేడియం ఏర్పాటు చేస్తామన్న ప్రజాప్రతినిదుల హామీ ఏళ్లయినా అమలు కావడం లేదు. దీంతో క్రీడాకారులకు శిక్షణ కరువవుతోంది. పట్టణంలో స్టేడియం నిర్మాణం గురించి పలుమార్లు రాష్ట్ర మంత్రులు, అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వినతిపత్రాలందజేశారు. ఐదు మండలాల కూడలిగా ఉండి హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ఆమనగల్లులో స్టేడియం లేకక్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలు, పాఠశాలలో చదువుకునేందుకు ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల నుంచి వేల మంది విద్యార్థులు ఆమనగల్లుకు వస్తుంటారు. పట్టణంలో విద్యాసంస్థలు విస్తరిస్తున్నాయి. వివిధ గ్రామాల విద్యార్థులు చదువు కోసం స్థానికంగా ఉంటున్నారు. స్టేడియం లేక, పాఠశాలల్లో క్రీడామైదానాల్లేక క్రీడల్లో క్రీడాకారులు, విద్యార్థులు, యువకులు శిక్షణ పొందలేకపోతున్నారు. వేసవి సెలవుల్లో ఉదయం, సాయంత్రం విద్యార్థులు, క్రీడాకారులు ఆటలు ఆడుదామన్నా విధిలేక సమీప పొలాలు, ఇళ్ల మధ్య, ఖాళీ ప్లాట్లలో ఆడుతున్నారు. క్రీడాపోటీల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, క్రీడాభిమానులు ముందుకొస్తున్నా మైదానాల్లేక ఇబ్బందికరంగా మారింది. ఆమనగల్లులో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజాప్రతినిధులు స్టేడియం ఏర్పాటుకు హామీలిచ్చినా అమలు కాలేదు. పట్టణంలోని అనేకచోట్ల స్టేడియానికి అనువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నా వాటిని కేటాయించేందుకు నాయకులు, అధికారులు ప్రయత్నాలు చేయడం లేదు. ఆమనగల్లులో మినీ స్టేడియం ఏర్పాటుతో ఐదు మండలాల క్రీడాకారులు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. నేతలు, అధికారులు స్టేడియం నిర్మాణానికి చొరవతీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


స్టేడియం ఏర్పాటు చేయాలి



ఆమనగల్లులో మిమీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలి. ఐదు మండలాలకు కూడలి గా ఉన్న ఇక్కడ స్టేడియం లేక క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా క్రీడాకారులు శిక్షణ లేక జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించలేకపోతున్నారు. స్టేడియం కడితే క్రీడా పోటీల నిర్వాహణకు, శిక్షణకు పనికొస్తుంది. స్టేడియం నిర్మాణ విషయంలో ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించాలి.

- వీరబొమ్మ రామ్మోహన్, ఆమనగల్లు

గ్రౌండ్‌కు స్థలం కేటాయించాలి



మినీ స్టేడియం నిర్మాణానికి పట్టణంలో స్థలాన్ని కేటాయించాలి. నిర్మాణానికి ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయాలి. స్టేడియం నిర్మిస్తే క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, క్రీడాకారులు శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. పట్టణంగా అభివృద్ధి చెందుతున్న ఆమనగల్లులో స్టేడియం లేకపోవడం పెద్దలోటు.

- పవన్‌కల్యాణ్, ఆమనగల్లు



చౌదరిగూడ : కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఉగ్రదాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

చౌదరిగూడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేసి, ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, బీజేపీ చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ మచ్చసుధాకర్‌రావులు అన్నారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ఉగ్రవాద దాడికి నిరసనగా కొవ్వొత్తులతో నిరసన తెలిపి ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మల్లేష్, రాజు, అనిల్‌కుమార్, ప్రభు, రమేష్, అంజనేయులు, లక్ష్మీనారాయణ, మిట్టేరాజు, హరి తదితరులున్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న బాబయ్య

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు వివరించాలని బీజేపీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అందె బాబయ్య తెలిపారు. గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిష్ణువర్ధన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సురేష్, కుర్మయ్య, రఘు, ప్రశాంత్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో నరకయాతన

- అధ్వానంగా మేడిపల్లి-పల్లెచెల్కతండా రోడ్డు
- మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల విన్నపం



మేడిపల్లి నుంచి పల్లెచెల్కతండా రోడ్డు దుస్థితి

యాచారం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేడిపల్లి నుంచి కడ్తాల మండలం పల్లెచెల్కతండా వరకు వేసిన రోడ్డు పాడై రెండేళ్లవుతున్నా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు మొత్తం గుంతల మయం కావడంతో ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఈ రోడ్డు దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర పూర్తిగా ధ్వంసమైందని, ఈ విషయమై మేడిపల్లి, పల్లెచెల్కతండాకు చెందిన ప్రజాప్రతినిధులు జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు వివరించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అయితే, జిల్లా పరిషత్‌లో నిధులు లేకపోవడంతో రోడ్డును బాగుచేయడానికి అధికారులు ముందుకు రావడం లేదని పలువురు చెబుతున్నారు. ఇకపోతే రోడ్డు మరమ్మతుకు రూ.4 లక్షల నిధులు మంజూరు చేసి రోడ్డు మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డును బాగుచేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రోడ్డు పాడై రెండేళ్లవుతున్నా అధికారులు ఎందుకు బాగు చేయడంలేదో అర్థం కావడం లేదు. అడుగడుగునా గుంతలుండడంతో ఆటోలు, బైక్‌లపై వెళ్లడం ఇబ్బందిగా ఉంది. జిల్లా పరిషత్ అధికారులకు తెలిసినా బాగు చేయడానికి నిధులు కేటాయించకపోవడం దారుణం. కలెక్టర్ కల్పించుకొని తక్షణమే నిధులు మంజూరుచేసి రోడ్డును బాగు చేయించడానికి చర్యలు తీసుకోవాలి.

- ఆలంపల్లి నర్సింహ, రైతు, మేడిపల్లి

'భూ భారతి'పై నేడు అవగాహన సదస్సు

కందుకూరు/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంపై నేడు కందుకూరు మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.గోపాల్, డీటీ శేఖర్‌లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. శంషాబాద్ మండలం కవేలిగూడకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కలెక్టర్ నారాయణరెడ్డి రానున్నట్లు తహసీల్దార్ రవీందర్‌దత్ చెప్పారు. ఈమేరకు సోమవారం సాయంత్రం 4గంటలకు వెంకటపూర్ చౌరస్తాలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

క్రైం కార్నర్

చెరువులో పడి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. శంకర్‌పల్లి ఎస్సై సుందరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని బుల్కాపూర్‌నకు చెందిన గడ్డం లక్ష్మయ్య(44) సెంట్రింగ్ కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అయితే శనివారం లక్ష్మయ్య ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో భార్య జయమ్మ బుల్కాపూర్‌లోని తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీసింది. ఈక్రమంలో ఆదివారం ఉదయం లక్ష్మయ్య చెరువులో శవమై కనిపించడంతో గ్రామస్తులు చూసి పోలీసులతో పాటు కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అయితే, ఆయనకు ఫిట్స్ ఉందని, అదే కారణంతో చెరువు వద్దకు వెళ్లిన సమయంలో చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. లక్ష్మయ్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు ఢీకొని మరొకరు..

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రైల్వే స్టేషన్ పరిధిలోని బూర్గుల శివారులో రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటయ్య(65) ఆదివారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ స్టేషన్ మాస్టర్ విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- అలారం మోగడంతో పరారైన దుండగుడు



ఏటీఎంలో చోరీకి యత్నిస్తున్న దుండగుడు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశాడు ఓ దుండగుడు. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై బస్‌స్టాండ్‌కు ఎదురుగా ఉన్న సౌత్ ఇండియన్ ఏటీఎంలో చోరీ చేయడానికి గుర్తుతెలియని దుండగుడు ఆదివారం తెల్లవారుజామున తలకు హెల్మెట్ పెట్టుకొని వచ్చి ముందుగా ఏటీఎంలోని సీసీ కెమెరాల వైర్లు కట్ చేశాడు. తరువాత ఏటీఎంను ధ్వంసం చేయడానికి యత్నించగా అలారం మోగింది. దాంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఏటీఎం మిషన్ స్వల్పంగా దెబ్బతింది. క్లూస్‌టీంతో వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. చోరీకి ఒక్కడే వచ్చాడని.. అలారం మోగడంతోనే పరారయ్యాడని సీఐ తెలిపారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని తెలిపారు. అయితే, ఏటీఎంలో ఎలాంటి డబ్బు పోలేదని వారు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మూడు గజాల స్థలం.. ఇరువర్గాల ఘర్షణ

- పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా వ్యక్తికి గుండెనొప్పి
- ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి

యాచారం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇంటి పక్కన ఉన్న మూడు గజాల స్థలం విషయంలో రెండు కుటుంబాలకు చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఇంతలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తుండగా అందులో ఒకరికి గుండెనొప్పి రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందిన ఘటన ఆదివారం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేష్(43)కు పక్కింటి వారైన శ్రీకాంత్, పవన్‌లతో మూడు గజాల స్థలం విషయంలో చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా గొడవకు దిగారు. దాంతో వెంకటేష్, శ్రీకాంత్, పవన్ కుటుంబీకులు యాచారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇరుకుటుంబాల తగాదాను పోలీసులకు వివరించారు. ఈక్రమంలో వెంకటేష్ భార్య స్వాతి తమ కుటుంబానికి జరుగుతున్న అన్యాయంపై ఫిర్యాదు చేస్తుండగా వెంకటేష్ గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే అంబులెన్స్‌లో ఇబ్రహీంపట్నం తీసుకెళ్లారు. అక్కడి ఆసుపత్రుల్లో వెంకటేష్‌కు మెరుగైన వైద్యమందించలేకపోయారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకటేష్ మరణించాడు. శవపరీక్ష నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై మధు తెలిపారు. కాగా, వెంకటేష్‌పై శ్రీకాంత్, పవన్‌లు దాడి చేయడంతోనే మరణించాడని ఈ సందర్భంగా బంధువులు ఆరోపిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు!

(5వ పేజీ తరువాయి)

నిర్వాహకులు మితిమీరి వ్యవహరిస్తున్నారు. రైతుల నుంచి వ్యవసాయ బోర్లను లీజ్‌కు తీసుకుని ఇటుక బట్టీలకు నీటిని ఉపయోగించుకుంటున్నారు మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించుకుంటూ మూడు పువ్వులు.. ఆరుకాయలుగా వ్యాపారం చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

చౌదరిగూడ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూముల్లో బట్టీలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు వినియోగిస్తే నాలా కన్వర్షన్ చేసి ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు నిబంధనల ప్రకారం పన్నులు కట్టకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అలాగే బట్టీల నిర్వహణకు కాలుష్య నియంత్రణ, భూగర్భ జలవనరులు, పంచాయతీలు, కార్మికశాఖ, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా పర్మిషన్లు లేకుండా చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తరలించి ఇటుకల తయారీకి వినియోగిస్తున్నారు. వ్యవసాయ పొలాల మధ్య బట్టీలను ఏర్పాటు చేయడం ద్వారా విపరీతంగా పొగ వెలువడి వాయు కాలుష్యమవుతుందని, తద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక రైతులు వాపోతున్నారు. అలాగే కార్మిక చట్టాలు పాటించకుండా బాలకార్మికులతో పనులు చేయించుకుంటూ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారని, ఇంత జరుగుతున్నా అధికారులు మౌనం వహించడంలో అంతర్యమేమిటో చెప్పాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఉచిత కరెంట్ వినియోగం!

ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందిస్తున్న విద్యుత్ ఇటుక వ్యాపారులకు వరం మారింది. పంటల సాగుకోసం వినియోగించాల్సిన ఉచిత విద్యుత్‌ను ఇటుక బట్టీల వ్యాపారానికి వాడుకుంటున్నారు. ఇటుకల తయారీకి అవసరమయ్యే నీటి కోసం విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఓ పక్క రైతులు వేసిన పంటలకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరగక లోవోల్టేజీ కారణంగా బోరు మోటర్లు కాలిపోతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అక్రమ కనెక్షన్‌లను అరికడితే విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. కొందుర్గు మండలంలో ఎంకిర్యాల, ఆగిర్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో జిల్లేడ్, చెన్నారెడ్డిగూడ, జాకారం చెగిరెడ్డి ఘణాపూర్, కాస్లాబాద్ తదితర గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు వెలిశాయి.

కాలుష్యంతో పంటలకు నష్టం

వ్యవసాయ పొలాల పక్కన ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడం వల్ల విపరీతంగా వాయు కాలుష్యం ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని ద్వారా మిరప, టమాట, బెండ కూరగాయాలు పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. బట్టీల నుంచి నిప్పురవ్వలు వచ్చి కూరగాయాల పంటలపై పడుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. కూరగాయాలు మార్కెట్‌కు తీసుకెళ్తే గిట్టుబాటు ధర రావడంలేదని చెబుతున్నారు. కాలుష్యం వెదజల్లుతున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తే ఊరుకోం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అన్ని శాఖల అనుమతులు తీసుకున్న తర్వాతే బట్టీలు ఏర్పాటు చేసుకోవాలి. వ్యవసాయ పొలాల మధ్య బట్టీలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది కలిగించొద్దు.

- జగదీశ్వర్, తహసీల్దార్, జిల్లేడ్ చౌదరిగూడ

ఉచిత విద్యుత్ వాడితే కేసులు నమోదు

ఇటుక బట్టీల నిర్వహణకు ఉచిత విద్యుత్ వినియోగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు తప్పని సరిగా కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలి. లేదంటే చట్టరీత్యా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తాం.

- రవికుమార్, ట్రాన్స్‌కో ఏఈ, ఉమ్మడి కొందుర్గు మండలం

ఆహ్లాదానికి ఆమనగల్లు దూరం!

(5వ పేజీ తరువాయి)

స్థలాలు కూడా పార్కులకు అనుకూలంగా ఉన్నాయి. మాడ్గుల రహదారిలో ఉన్న శివాజీ పార్కు, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు దశాబ్దాల క్రితం ఫైవ్‌స్టార్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నపిల్లల పార్కు నిర్వహణ కొరవడి కళాహీనంగా మారాయి. ఈ పార్కుల్లోని ఆట వస్తువులు తుప్పు పట్టిపోయాయి. అదే కార్యాలయం ఎదుట తెలంగాణ తల్లివిగ్రహం వద్ద కూడా పచ్చదనం లేక వెలవెలబోతుంది.

అసంపూర్తిగా పార్కుల నిర్మాణం..

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ఐదు పార్కుల ఏర్పాటుకు రెండేళ్ల క్రితం ప్రతిపాదించారు. ఆమనగల్లులో రెండు పార్కుల ఏర్పాటుకు రూ.1.50 కోట్లు, జంగారెడ్డిపల్లి, ముర్తోజుపల్లి, సంకటోనిపల్లి గ్రామాలలో మూడు పార్కుల నిర్మాణానికి రూ.60లక్షలు టీయూఎఫ్ఐడీసీ నిధులను కేటాయించడం జరిగింది. కాగా నేటికీ ఒక్క పార్కు నిర్మాణం కూడా పూర్తి కాలేదు. ఆమనగల్లు సూర్యలక్ష్మి కాటన్ మిల్లు ఎదుట ఓ వెంచర్‌లో ఎకరంన్నర స్థలం పార్కుకు కేటాయించారు. ఏడాదిక్రితం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి పార్కును డెవలప్‌చేయకుండా మధ్యలోనే ఆపేశారు. అదేవిదంగా స్థానిక అయ్యప్ప ఆలయ ముఖ ద్వారం వద్ద రెండేళ్ల క్రితం పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ. 10 లక్షలు కేటాయించారు. పనులు ప్రారంభించి భూమిని కూడా చదును చేశారు. కానీ భూమి మున్సిపాలిటీ బదలాయింపు జరుగక, చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. ఆ తర్వాత 9 గుంటల భూమి బదలాయింపు జరిగినా.. పనుల విషయం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

కలగానే మినీ ట్యాంక్‌బండ్

ఆమనగల్లు సురసముద్రం చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5.80 కోట్లు మంజూరు చేసింది. మంజూరైన నిధులతో చెరువు కట్టను విస్తరించి ఇరువైపులా రేలింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌ను నిర్మించాలని పనులు ప్రారంభించారు. సకాంలో నిధులు విడదల కాక పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఐదేళ్లుగా అసంపూర్తి పనులు పూర్తి చేయడం లేదు.

పార్కులు ఏర్పాటు చేయాలి



ఆమనగల్లు పట్టణంలో పార్కుల ఏర్పాటు విషయంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి. పార్కులు లేక ఆట విడుపుకు ఇబ్బందిగా మారింది. అనువైన ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసి పార్కులు నిర్మించాలి. అసంపూర్తి పార్కుల నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి.

- పాపిశెట్టి రాము, ఆమనగల్లు

నిర్మాణానికి చర్యలు



ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో పార్కుల నిర్మాణం దిశగా చర్యలు చేపట్టాం. గతంలో చేపట్టిన రెండు పార్కుల నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులకు నివేదించాం. ఇటీవల మాడ్గుల రోడ్డులో ధరణి వెంచర్‌లో పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదించాం. గతంలో ప్రతి పాదించిన పార్కులు, ఓపెన్ జిమ్‌ల నిర్వహణకు చర్యలు చేపడుతాం.

- శంకర్‌నాయక్, మున్సిపల్ కమిషనర్, ఆమనగల్లు

సంక్షిప్తంగా..

మంచాల : సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఆర్థిక చేయూత లభిస్తోందని ఆరుట్ల మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ తెలిపారు. మంచాల మండలం ఆరుట్లలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రావుల బాషా, జంగయ్యగౌడ్, రమేష్, బుగ్గరాములు, తదితరులున్నారు.

ఆమనగల్లు : అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులు లక్ష్మణ్ నాయక్, మర్రిగుంత తండాకు చెందిన పాండు నాయక్‌లను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు.

రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు జిల్లా నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో నాయకులు జెండాలను ఆవిష్కరించారు. పార్టీ జెండాలు చేబూని ర్యాలీలు నిర్వహించారు. అనంతరం సభకు బయలుదేరి వెళ్లారు.



తలకొండపల్లి : రజతోత్సవ సభకు తరలిన మాజీ జడ్పీటీసీ వెంకటేశ్ నాయకులు



శంషాబాద్ రూరల్ : పెద్దతూప్రలో జెండా ఎగురవేస్తున్న మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్



కందుకూరు : సభకు తరలివెళుతూ తుక్కుగూడలో ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన నాయకులు



మాడ్గుల : ఆర్కపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చేవెళ్ల : సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



యాచారం : అయ్యవారిగూడలో జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మంచాల : బస్సులో వెళ్తున్న నాయకులు



చౌదరిగూడ: సభకు బయలుదేరిన నాయకులు



షాద్‌నగర్ : సభకు తరలిన నాయకులు



కేశంపేట : ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కొత్తూర్ : సభకు తరలివెళ్లేముందు జెండావిష్కరణలో నాయకులు



కడ్తాల : వరంగల్‌కు బయలు దేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రజల భాగస్వామ్యంతోనే పనుల్లో నాణ్యత



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న లక్ష్మణ్

ఆమనగల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజల పర్యవేక్షణ, భాగస్వామ్యంతోనే పనులు నాణ్యతగా, వేగవంతంగా జరుగుతాయని ఆమనగల్లు మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీజేపీ జిల్లా నాయకుడు చెక్కాల లక్ష్మణ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు శివాలయం కాలనీలో రూ.2 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కాలనీ వాసులతో కలిసి లక్ష్మణ్ ప్రారంభించారు. నాయకులు శ్రీధర్, కృష్ణారెడ్డి, అల్తాఫ్, ఖాదర్, అంజయ్య, శ్రీరాములు, రామకృష్ణ, గౌస్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

రాంరెడ్డికి ఎంపీ అరుణ పరామర్శ



ఆమనగల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళపల్లి గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ తిప్పిరెడ్డి రాంరెడ్డి గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు ఆసుపత్రికి వెళ్లి రాంరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ కోరారు. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన పాలమూరి అనసూయ ఇటీవల మోకాలి నొప్పులతో బాధపడుతుండగా, స్థానిక బీజేపీ నేతల ప్రోత్సాహంతో చికిత్సకు రూ.56వేల సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. ఈమేరకు ఆదివారం నగర శివారులోని నాదర్‌గుల్‌లోని ఆయన చాంబర్‌లో చెక్కును అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.